www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 ఏప్రిల్ 2023
5
చిత్తూరు

# జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..

## నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్

బాధ్యత స్వీకరిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లాకు కలెక్టర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందని, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో నూతన జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈమీడియా సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లాలో మొదటిసారిగా జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సకాలంలో అర్హులైన వారికి అందించడంతోపాటు అధికారులు ప్రజలు మీడియా అందరి సహకారంతో జిల్లా సమగ్రాభివద్ధికి పనిచేయడం జరుగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల ద్వారా పరిపాలనలో మార్పులు వచ్చాయన్నారు. ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ సేవలు అందించే అవకాశం దక్కిందన్నారు.

**2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సగలి షన్మోహన్**

ప్రకాశం జిల్లాలో ట్రైనీకలెక్టర్, జాయింట్ కలెక్టర్, సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన అనంతరం రాష్ట్రస్థాయిలో వివిధ పోస్టుల్లో పనిచేశారు. రాష్ట్ర స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండిగా ఉంటూ అదనంగా గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థ రాష్ట్ర డైరెక్టర్‌గా మారిటైమ్ బోర్డు (సముద్ర రవాణాకు సంబంధించిన) సీఈవోగా పనిచేస్తూ బదిలీపై తొలిసారిగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియామకం కాబడ్డారు.

**కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ**

చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సగిలి షన్మోహన్ సోమవారం ఉదయం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సచివాలయంకు చేరుకున్న కలెక్టర్‌కు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ పదవీ బాధ్యతలు స్వీకరించగా జిల్లా అధికారులైన హౌసింగ్ పీడీ పద్మనాభం, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఏ డ్వామా, ఐసిడిఎస్, మెప్మా పీడీలు తులసి, గంగాభవాని, నాగశైలజ, రాధమ్మ, ఐఅండ్ పీఆర్ డిడి పద్మజ, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి రాజ్యలక్ష్మి, డిపిఓ లక్ష్మి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, చిత్తూరు, నగరి, కుప్పం ఆర్‌డిఓలు రేణుక, సుజన, శివయ్య, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమర్నాథ్, సెక్రెటరీ హుస్సేన్ కలెక్టరేట్ ప్రెసిడెంట్ పార్థసారథి, చిత్తూరు డివిజన్ ప్రెసిడెంట్ విజయ్‌కష్ణ, డిస్టిక్ ట్రెజరర్ రమేష్ తదితరులు కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్‌ల సూపరింటెండెంట్లు ఇతర జిల్లాస్థాయి అధికారులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

**కలెక్టర్‌కు స్వాగతం పలికిన పండ్ల పరిశ్రమ నేతలు**

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షన్మోహన్‌ను కలెక్టరేట్‌లో సోమవారం పండ్ల పరిశ్రమ నాయకులు కట్టమంచి బాబి కలసి సన్మానించారు. పండ్ల పరిశ్రమల గురించి ఇతర సమస్యల గురించి చర్చించారు. పండ్ల పరిశ్రమల గురించి రాబోయే సీజన్ గురించి చర్చించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

బాధ్యత తీసుకున్న తొలిరోజే గంగాధర నెల్లూరు గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన కమిషనర్**

చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షన్మోహన్‌ను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. సోమవారం ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద కమిషనర్ నూతనకలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

**వరసిద్ధుని సేవలో నూతన కలెక్టర్**

**ఐరాల:** శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారిని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆలయంకు చేరుకున్న కలెక్టర్‌కి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఐరాల తహశీల్దార్ సుశీల స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ వారి కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆశీర్వాదాలతో తీర్థప్రసాదాలను అందజేశారు.

# కరోనా కష్టాలు..

## కష్టకాలంలో పనిచేసినా అందని జీతాలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**

కష్టకాలంలో వైద్యసేవలు అందించిన డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, నర్సులు జీతాలు అందకపోవడంతో ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కరోనా సోకిన వ్యక్తి దగ్గరకు సొంతవాళ్ళు, బంధువులు, స్నేహితులు దగ్గరకు వచ్చేందుకు భయపడుతున్న సమయంలో వైద్యసేవలు అందించిన తమకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కుటుంబాలను వదలి సొంతఇంటికి వెళ్లలేని పరిస్థితుల్లో కరోనా రోగుల మధ్య గడిపామని, గంట, అర గంటకొక్కరు కళ్లఎదుటే చనిపోతుంటే బరువెక్కిన హృదయాలతో కంటతడి బయటకు రాకుండా కరోనా రోగులకు వైద్య సేవలందించిన మా జీతాలు పెడింగ్ పెట్టడం అంటూ ఆక్రోశిస్తున్నారు.

**కరోనా... కరోనా...**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కరోనాటెస్టులు, రోగులతో నిండిపోయాయి. ప్రపంచమంతా కరోనాతో అట్టుడికిపోయింది. కరోనా నిర్ధారణ అయిన వ్యక్తులను క్వారంటైన్ కేంద్రాలకు తరలించారు. కరోనా సేవలు అందిస్తూ అనేక మంది వైద్యసిబ్బంది అశువులు బాశారు. ఇలాంటి పరిస్థితుల్లో జీతం తక్కువైనా మానవాతా ధృపథంలో కరోనా సోకిన వ్యక్తులను కాపాడేందుకు ముందుకు వచ్చిన వైద్యులు, నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఐదు నుంచి ఆరు నెలలుగా వేతనాలు అందలేదని ఇదేనా మాసేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న గౌరవం అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క చిత్తూరు జిల్లాలోనే కాదు రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

కరోనా కష్టకాలంలో వైద్యసేవలు అందించేందుకు తీసుకున్న వైద్యసిబ్బందికి ప్రభుత్వం జీతాలు అందలేదు. చిత్తూరు జిల్లా కేంద్రమైన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా రోగులకు వైద్యసేవలు అందించిన 10మంది వైద్యులు, 40 మంది నర్సులు, 10 టెక్నికల్ అసిస్టెంట్లు, 24 మంది డేటాఎంట్రీ అపరేటర్లు అక్టోబర్ 2021 నుంచి ఫిబ్రవరి 2022 వరకు దాదాపు ఐదు నుంచి ఆరు నెలల జీతం అందలేదు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్యసేవలు అందించిన సిబ్బంది నేడు జీతాల కోసం పోరాటం చేయాల్సి వస్తోంది. ఆరు నెలల పెండింగ్ జీతాలు ఇప్పించండి సారూ.. అంటూ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నా... నేడు.. రేపు.. అంటూ కాలం వెళ్ళదీస్తున్నారు. కరోనా సమయంలో ధైర్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్య సేవలందించిన మాకిచ్చే అతి తక్కువ వేతనాలు పెడింగ్ పెడితే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతాలు ఇప్పించాలని కోరుతున్న వైద్య సిబ్బంది

**జీతం కోసం తిరగాల్సి వస్తోంది..**

కరోనా సమయంలో టెక్నికల్ అసిస్టేంట్‌గా పనిచేశాను. కరోనా నిర్ధారణ టెస్టులు చేశారు. రాత్రిపగలు అని తేడా లేకుండా పనిచేసిన మాకు జీతాలు ఇవ్వకపోవడం అత్యంత దారుణం ప్రభుత్వం ఆలోచించాలి. మరోమారు ఇలాంటి పరిస్థితి ఏర్పడితే వైద్య సేవలందించేందుకు ఎవరు ముందుకు వస్తారు. చేసినపనికి జీతం ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నాలుగు నెలలుగా కలెక్టర్, డిఎంఅండ్ హెచ్‌ఒకు పిర్యాదు చేస్తున్నా ఇదిగో అదిగో అంటున్నారే తప్ప జీతం మాత్రం అందలేదు.

**- జ్ఞాన సుందరం, టెక్నికల్ అసిస్టెంట్**

**ఇంట్లో వద్దన్నా సేవచేశా...**

కరోనా సమయంలో రోగుల మధ్య పనిచేయడం మంచిది కాదు అంటూ ఇంట్లో వాళ్ళు వద్దానా పట్టించుకోకుండా వైద్య సేవలు అందిచాను. మా శ్రమకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా జీతాలివ్వకుండా వేధిస్తున్నారు. కరోనా రోగులకు సేవలందిచామన్నా సంతృప్తి కూడా లేకుండా చేస్తున్నారు.

**- మమత, డేటా ఎంట్రీ ఆపరేటర్**

## స్పందనకు అర్జీలు 277

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూశాఖకు 168, హౌసింగ్‌శాఖ 6, మున్సిపల్ శాఖ 3, పంచాయతీరాజ్ శాఖ 5, జిల్లా పరిషత్ 1, విద్యాశాఖ 1, డిఆర్‌డిఏ 2, జిల్లా ఉపాధి కల్పనశాఖ 1, డిసిహెచ్ఎస్ 1, ఎక్సైజ్‌శాఖ 1, డ్వామా 6, సోషల్ వెల్ఫేర్ 16, హార్టికల్చర్ 1, పింఛన్లు, రేషన్‌కార్డ్స్ 65 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా డిఆర్ఓను, జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన'

స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకూడదని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పి.జగదీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 19 ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పి.జగదీష్ స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీ, అడిషనల్ ఎస్పీ లక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 19 ఫిర్యాదులు అందగా వాటిలో చీటింగ్ 1, దొంగతనాలు 1, వేధింపులు 7, భూతగాదాలు 3, ఆస్తి తగాదాలు 5, పోలీస్ సేవలు 2 ఉన్నాయి.

## సకాలంలో స్పందన వినతుల పరిష్కారం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను సకాలంలో విచారించి పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం అందిన వినతులు పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో అందే వినతులపై సంబంధిత శాఖాధిపతులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 2, ప్రజారోగ్య విభాగం 2, రెవెన్యూ 2, మెప్మా 1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దళిత, గిరిజన, మైనార్టీల జోలికొస్తే పతనం తప్పదు

**రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరాజు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సిపిఐ పిలుపు మేరకు చిత్తూరు ఎస్టియు కార్యాలయంలో విసి.గోపీనాథ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, గిరిజనులు, ముస్లిములు, క్రిస్టియన్, మైనార్టీలపై దాడులు పెరిగాయని, మహిళల విషయంలో వయసుతో నిమిత్తం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నా కేంద్రంలో మోడీప్రభుత్వం రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దళిత, గిరిజన, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలపై జరుగుతున్న దాడులను, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, అవమానాలను అరికట్టకపోతే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ దళిత, ఎమ్మార్పీఎస్, కార్మిక సంఘాలు, దాసరి చంద్ర, సురేంద్రన్, ధనంజయ, మునుస్వామి, వరదరాజులు, రాజకుమార్, రాజా, రమేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, ఏఐటీయూసీ నాయకులు మణి, ప్రసాద్, ఈశ్వర, ప్రతాప్, విజయ్ గౌరీ, జయకుమారి, జమీలబి, జయలక్ష్మి, కుమారి, శ్యామల, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపుకు మంత్రి భరోసా

**ముగిసిన శిబిరం, 2800 మందికి చికిత్స**

**ప్రజాశక్తి- నగరి:** కంటి సమస్యలున్న వారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా శంకర నేత్రాలయ సహకారంతో 8 రోజుల పాటు నగరిలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ శిబిరానికి 8 రోజుల్లో 2800 మంది పేషంట్లు చికిత్స నిమిత్తం విచ్చేశారు. 93 రకాల కంటికి సంబంధిత వ్యాధులను పరిశీలించిన వైద్యులు వీరిలో 400మందిని వివిధ కంటి చికిత్సల నిమిత్తం శంకరనేత్రాలయ బేస్ సెంటర్‌కు తరలించారు. కంటి పొర సమస్య ఉన్న 250మందికి చికిత్స జరిగిన ప్రాంతంలోనే నొప్పిలేకుండా, కుట్లు లేకుండా అత్యధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసి రెండు గంటల వ్యవధిలో వారిని ఇంటికి పంపారు. ఐఓఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. చివరి రోజున ఆపరేషన్ చేసుకున్న వారిని మంత్రి ఆర్కే.రోజా పరామర్శించారు. అందరినీ పేరుపేరునా పలకరించి ఇక ఎలాంటి సమస్య ఉండదని కంటి చూపు బాగా కనబడుతుందని వైద్యులతో కలిసి భరోసా ఇచ్చారు. అందరికీ తన నివాసం వద్దే భోజనం పెట్టి వారిని ఇళ్లకు పంపించారు.

## కోవిడ్ వార్డు ఏర్పాటు

కోవిడ్ వార్డును ప్రారంభించిన మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్

**ప్రజాశక్తి- నగరి:** కోవిడ్ కేసులు అక్కడక్కడా మళ్లీ వస్తుండటంతో ఈ స్థాయిలోనే కట్టడి చేయాలని ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో 5 బెడ్లుతో కూడిన కోవిడ్ వార్డును ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వైద్యులు ప్రారంభించారు. కోవిడ్‌కు సంబంధిత మందులు, పరికరాలు అందుబాటులో ఉంచారు. ఈకార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్, ఆర్ఎంఓ గోపాల్, వైద్యులు కార్తిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక పిసిఆర్ సర్కిల్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి అనంతరం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాల్ నందు మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## నేడు వాహనాల వేలం

**ప్రజాశక్తి- నగరి:** వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ ఉన్న వారు వేలంలో పాల్గొన వచ్చున్నారు. ఆసక్తి ఉన్న వారు వారి జీస్టీ వివరాలతో ఉదయం 10గంటలకు పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి వేలంలో పాల్గొనాలని అన్నారు.

# పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించండి

**టిడిపి నాయకుల ధర్నా**

**ప్రజాశక్తి- వికోట:** రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై అధిక భారం మోపడాన్ని నిరసిస్తూ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏఎం రంగనాథ్ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు అందజేశారు. రామచంద్ర నాయుడు, ఈశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**గంగాధరనెల్లూరు:** మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీల పెంచి వినియోగదారులపై ఎనలేని భారం మోపారని నిరసిస్తూ నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

**గుడిపల్లి:** మండలంలో సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల నాయకులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు

**పాలసముద్రం:** మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని టిడిపి నాయకులు నిరసన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు సి.రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి ఎం.శేఖర్ రాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు వి.శాంబశివన్, తదితరులు పాల్గొన్నారు.

**పలమనేరు:** పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు.

అనంతరం పలమనేరు ట్రాన్స్‌కో ఏడి చిన్నబ్బకు వినతిపత్రం అందించారు. ఆర్టీసీ కుట్టి, గిరిబాబు, నాగరాజ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మోహన్ మురళి, నరసింహ యాదవ్, మునిచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషన్ చంద్, వరప్రసాద్, చంద్రబాబు రెడ్డి పాల్గొన్నారు.

**గంగవరం:** మండలంలోని పత్తికొండ పంచాయతీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు తెలుగుదేశం పార్టీ నాయకులు జాతీయ రహదారి నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం ట్రాన్స్ అధికారులకు వినతిపత్రం అందించారు.

**బైరెడ్డిపల్లి:** విద్యుత్ చార్జీల పెంపుపై మండల టిడిపి నాయకులు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుండి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సబస్టేషన్ ముందు నిరసన తెలిపారు. మండల అధ్యక్షులు బిఎం.కిషోర్ గౌడ్, మండల టిడిపిప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని టిడిపి ఉపాధ్యక్షులు కమల్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సర్పంచులు కోకా ప్రకాష్‌నాయుడు, మాజీ సర్పంచ్ నీరజాక్షల గౌడ్, జనార్దన్ గౌడ్, చిన్నయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐ లోకేష్‌కు ఘనసన్మానం

ప్రజాశక్తి - వెదురుకుప్పం : మండలం సబ్ఇన్స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ లోకేష్‌ను టిడిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి, వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి పి.మోహన్ మురళి మండల పరిస్థితిని ఆయనకు వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు చంద్రబాబు రెడ్డి, నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సుధాకర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వరప్రసాద్, మండల టిడిపి కార్యదర్శి పి.వెంకటేష్, శ్రీరాములురెడ్డి, కార్తీక్, అమర్నాథ్, బాలరాజు, తిమ్మరాజు చంద్రశేఖర్, సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## వివరాలు అప్‌డేట్‌గా పెట్టండి : ఎంపిడిఒ

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు సచివాలయాల్లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి పెట్టాలని ఎంపీడీవో శ్రీదేవి ఆదేశించారు. మండలంలోని తూగుండ్రం, ఆంబోధరపల్లి, మహాదేవ మంగళం సచివాలయాలను సోమవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను సచివాలయాల్లో ప్రదర్శనకు పెట్టాలన్నారు. అంతేకాకుండా ప్రజలకు సంబంధించిన సచివాలయ సర్వీసులు ఏరోజుకు ఆ రోజు ప్రజలకు ఇబ్బంది లేకుండా సచివాలయం సర్వీస్‌లు పెంపొందించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి- నగరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తరపున నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీకి సంబంధిత పోస్టర్లను సంఘ నాయకులు విడుదల చేశారు. సోమవారం స్థానిక బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘ నాయకులు గోవిందస్వామి, గాంధీ పోస్టర్లను కరపత్రాలను విడుదల చేసి సంఘ సభ్యులకు అందజేశారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజలందరికీ సంక్షేమ పథకాలు : ఎంపిపి

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. భవిష్యత్తులోనూ మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతిఇంటా కోరుకుంటున్నారని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని సురేంద్రనగరం, డీఎం.పురం, కేఎం.పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి, కత్తెరపల్లి గ్రామాల్లో పర్యటిస్తూ జగనన్నే మా భవిష్యత్తు వాల్‌పోస్టర్ను అంటించారు. అలాగే సచివాలయ కన్వీనరు గహసారధులు, వాలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజామద్దత్తు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానం రాబట్టారు. కార్యక్రమంలో వైసఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య, చందురాజు, పద్మనాభరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

కమిషనర్ హరిత

ప్రజాశక్తి -తిరుపతిటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ దామలచెరువు హరిత అన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కమిషనర్ హరిత స్పందిస్తూ ప్రజల నుండి వచ్చిన పిర్యాధులు, అర్జీలను సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మంచినీళ్లగుంటను సంరక్షించాలని కార్పొరేటర్ నరసింహాచారి, శాశ్వత పార్కింగ్ ఏర్పాటు చేయాలని ట్యాక్సీ అసోసియేషన్ వారు అర్జీ ఇచ్చారు. వీధివిక్రదారులకు గుర్తింపు కార్డులో ఇవ్వాలని, మాల్వాడిగుండం కాల్వలో చెత్త, పూడిక తీయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో...

# పాలెక్కడ..?

పిల్లలు, గర్భిణులకు 'సంపూర్ణ పోషణ' ఎక్కడ?

- రెండు నెలలుగా అందని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- తిరుపతి

**అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ, బాలింత పిల్లలకు అందజేసే పాలనూ సకాలంలో అందివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ప్రభుత్వ వైఫల్యమా లేక అధికారుల అలసత్వమా అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ప్రభుత్వం అందిస్తోన్న పాలు రెండునెలలుగా లబ్ధిదారులకు అందకపోగా ఉన్నతాధికారులెవరూ స్పందించకపోవడం గమనార్హం.**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో 4100 ఐసిడిఎస్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో చిన్నారులకు రోజుకు 100 మి.లీ. చొప్పున నెలలో 25 రోజులపాటు పాలు అందిస్తారు. దీని ప్రకారం నెలకు 2.5 లీటర్లు చిన్నారులకు ఇవ్వాలి. బాలింతలు, గర్భిణులకు రోజుకు 200 మి.లీ. చొప్పున 25 రోజులకు 5 లీటర్ల పాలు అందజేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు 8 లక్షల లీటర్ల పాల సరఫరా చేస్తున్నారు. విజయ పాల డెయిరీ నుంచి టెట్రా ప్యాకెట్ల ద్వారా పాలను అందిస్తున్నారు. అయితే అతి ముఖ్య పోషకాహారమైన పాలు అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా సరఫరా కావడం లేదు. మార్చి నెలలో దాదాపుగా పాల సరఫరా అన్ని కేంద్రాల్లోనూ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నరగా రెండు లేదా మూడు నెలలకోమారు పాల సరఫరా అవుతున్నట్లు ఐసిడిఎస్ కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. అయితే వీటిపై దృష్టి సారించాల్సిన ఉన్నతాధికారులు మాత్రం స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**10 శాతం పాలు వృధా !**

అరాకొరగా సరఫరా అవుతున్న పాలలోనూ దాదాపు 10 శాతం వృధా అవుతోంది. సరఫరా అయిన పాలల్లో కొన్ని టెట్రా ప్యాకెట్లు పగిలిపోవడంతో బ్యాక్టీరియా ప్రవేశించి చెడిపోతూ ఉండటం ప్రతి నెలా సంభవిస్తోంది. ఇలా దాదాపు 10 శాతం పాలు చెడిపోతూ ఉండటం గమనార్హం. వేసవి కాలంలో ఈ 'సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పాలు చెడిపోయాయని చెబితే ఎక్కడ వివరాలు, వివరణలు, తీర్మానాలు ఇవ్వాల్సి ఉంటుందోనన్న భయంతో లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చామంటూ నిర్వాహకులు ఆన్లైన్లో నమోదు చేసుకుంటుండటం గమనార్హం.

**సకాలంలో పాలను అందించాలి**

**వాణిశ్రీ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నేత**

బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పూర్తిస్థాయిలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు అధికారులదే. అయితే సకాలంలో పాలు అందక పోవడం వల్ల లబ్దిదారులు ఇబ్బంది పడటమే కాకుండా అంగన్‌వాడీ నిర్వాహకులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో పాలను లబ్దిదారులకు అందించాలి.

**పాలు అందేలా చర్యలు తీసుకుంటాం**

**నాగశైలజ, ప్రాజెక్టు డైరెక్టర్ , జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ**

అంగన్వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కర్నాటక నుంచి సరఫరా కావాల్సిన పాలు ఆలస్యమైన మాట వాస్తవమే. ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించి ఉన్నాం. త్వరలోనే అన్ని కేంద్రాలకూ పాలను సరఫరా చేస్తాం. పాలూ వృధా కాకుండా అబ్దిదారులకు అందేలా చర్యలు చేపడతాం.

### గురుకులంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## విద్యార్థులతో ముఖాముఖి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యసాధనకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ గంగాధర్ నెల్లూరు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకులంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని తరగతి గదులను కలయ తిరిగి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం దాని నాణ్యత ఎలా ఉందని అడుగగా విద్యార్థులు భోజనం రుచికరంగా ఉందని తెలిపారు. 5తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ప్రస్తుతం బోధిస్తున్న ఆంగ్ల విద్యాబోధన అర్థమవుతున్నదాని కలెక్టర్ అడగడంతో విద్యార్థులు అర్థమవుతుందని తెలిపారు. అనంతరం హాస్టల్ లో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అడగడంతో విద్యార్థులు ఏమీ లేవు సార్ అంతా బాగుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని సూచించారు.. పాఠ్యాంశాలను అర్థం చేసుకొని చదవాలని సూచించారు. విద్యార్థుల్లో రక్త హీనత లేకుండా మంచి పౌష్టికా హారం అందజేయాలని ఆదే శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు మొత్తం 480 మంది విద్యార్థులు ఉన్నారని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం జరుగుతుందని, మూడు నెలలకు ఒకసారి విద్యార్థులకు అనీమియా టెస్ట్ చేయడం జరుగుతుందని డిసిఓ డాక్టర్ జయ భారతి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట జీడీనెల్లూరు తహశీల్దార్ ఇంబునాధన్, గురుకుల అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'అక్షయ తృతీయ'కు మెజెస్టిక్ తంజావూరు ఆభరణాలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

అక్షయ తతీయ కోసం రిలయన్స్ జ్యువెలర్స్ నుండి మెజిస్టిక్ తంజావూర్ కలెక్షను ఆవిష్కరించింది. అద్భుతమైన 'తంజావూరు' సేకరణ ఆభరణాలను ధరించి ర్యాంపు అలంకరించిన అద్భుతమైన షోస్టాపర్ జాన్వీకపూర్. రిలయన్స్ జ్యువెల్స్ "తంజావూరు" సేకరణ వివాహాల నుండి పండుగ కార్యక్రమాలు, ప్రత్యేక సందర్భాలలో సరిపోయే విస్తారమైన సున్నితమైన ఆభరణాలను అందిస్తుంది. ఈ సేకరణలో అద్భుతమైన నెక్లెస్ సెట్లు, చోకర్లు, లేయర్డ్ నెక్లెస్లు, బ్యాంగిల్స్, బ్రాస్లెట్లు, చెవిపోగులు, ఉంగరాలు, నడుము బెల్ట్ లు, మాంగ్జిక్కాస్, ఇయర్ చెయిను ఉన్నాయి. రిలయన్స్ జ్యువెల్స్ సీఈవో సునీల్ నాయక్ మాట్లాడుతూ 'తమిళనాడులోని తంజావూరు యొక్క గొప్ప వారసత్వం సారాంశాన్ని సంగ్రహించే ఈ అక్షయతతీయ పాన్ ఇండియాలో తమ తంజావూరు సేకరణను ప్రదర్శించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీవారి దర్శనానంతరం తిరిగి వెళుతున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో దంపతులు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా కెజిఎఫ్‌కు చెందిన గోపినాథ్, శ్యామల దంపతులు కారులో రెండు రోజుల క్రితం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఆదివారం స్వామివారిని దర్శించుకుని, సోమవారం స్థానిక ఆలయాలు సందర్శించి, మధ్యాహ్నం తిరిగి తమ సొంతూరుకు పయనమయ్యారు. నాయుడు పేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని కాశిపెంట్ల బైపాస్‌రోడ్డులో ఆగి ఉన్న లోడ్ లారీని కర్ణాటకకు చెందిన దంపతుల కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ఇరుక్కుని గోపినాథ్ (40), శ్యామల(35) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను కారులోంచి వెలుపలికి చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వేగంగా వస్తున్న కారు ముందు ఆగి ఉన్న వాహనాన్ని గమనించకపోవడంతో ఢీకొన్నట్లు పోలీసులు అభిప్రాయపడ్డారు. ఎస్ఐ వంశీధర్ ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## రుయాలో 'కోవిడ్ మాక్ డ్రిల్'

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాల రుయా ఆసుపత్రిలో కోవిడ్ 19 మాక్ డ్రిల్ సోమవారం రుయా ఆసుపత్రిలో భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు కోవిడ్ 19 మాక్ డ్రిల్ నిర్వహించారు. రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ నాగ మునీంద్రుడు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీహరి పర్యవేక్షణలో ఈ కోవిడ్ మాక్ డ్రిల్ జరిగినది. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి పరిధిలోని బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉన్న పైప్‌లైన్ ఉపయోగాలు గురించి డాక్టర్ శ్రీహరి, డాక్టర్ నాగమణింద్రుడు అడిగి తెలుసుకున్నారు. ఈ మాక్ డ్రిల్ వల్ల కోవిడ్ 19 లో కలిగే పరిణామాల్ని ముందుగా పసికట్టుకొని రోగికి కావలసిన వైద్యం అందించడానికి తయారుగా ఉన్నట్లు ముందు సూచికలను తయారు చేసుకొనవచ్చునని తెలిపారు. కోవిడ్ సోకినట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం తీసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనస్తీసియా విభాగాతిపతి డాక్టర్ రాధా, జనరల్ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ యాదవేందర్ రెడ్డి, సి ఎస్ ఆర్ ఎంఒ డాక్టర్ లక్ష్మా నాయక్ పాల్గొన్నారు.



### నేరాలు - ఘోరాలు

## కుటుంబ కలహాలతో వివాహిత మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పెళ్లి జరిగి సంవత్సరం కూడా కాకముందే కుటుంబ కలహాలతో ఓ వివాహిత మరణించిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివయ్య, శిల్పలకు ముగ్గురు కూతుర్ను. వారిలో రెండో కూతురు శిరీష (19)ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన ములభాగల్ తాలూకా చెన్నసముద్రం గ్రామానికి చెందిన హరీష్ (20)కు ఇచ్చి 8 నెలల క్రితం వివాహం జరిపించారు. ఈనెల 6వ తేదీన గ్రామంలోని జాతరకు హరీష్, శిరీష కలిగి వచ్చారు. జాతరను జరుపుకుని శనివారం తిరిగి చెన్నసముద్రంకు చేరుకున్నారు. సోమవారం శిరీష మరణించిందన్న విషయం తెలియడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఒక్కసారిగా శోకసద్రంలో మునిగిపోయారు. ములబాగల్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని కూతురి మరణంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోలారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎస్‌వి జూకు కొత్త జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఎస్‌వి జంతుప్రదర్శనశాలకు కొత్త జంతువులు తీసుకొచ్చినట్లు జూ పార్కు క్యూరేటర్ సెల్వ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనిమల్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నెల 8వ తేది కాన్పూర్ జులాజికల్ పార్క్ నుంచి ఒక ఆడ ఆసియా సింహం, ఒక మగ తెల్లపులి, ఒక జత చింకారాలు, మూడు మోకోవీ బాతులు, మూడు స్వంప్ డీర్స్, ఒక జత హాగ్ డీర్స్, ఒక జత కాలిజ్ ఫీషంట్‌ను తీసుకొచ్చామన్నారు. ఎక్సేంజ్‌లో బాగంగా తిరుపతి ఎస్వి జూపార్కు నుంచి కాన్పూరు జులాజికల్ పార్క్‌కు ఒక జత అడివి దున్నలు, ఒక ఆడ తెల్లపులి, మూడు రేస్ కుక్కలు, మూడు వైట్‌ఇబీస్‌లు, మూడు గ్రేపిలికాన్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## బాలుకు జ్యోతిరావు పూలే పురస్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రమణ్యం జ్యోతిరావు పూలే పురస్కారంకు ఎంపిక అయ్యారని పూలే టీచర్స్ ఫెడరేషన్ నిర్వాహకులు సోమవారం పేర్కొన్నారు. విద్య, సాహిత్యం, కళ, సామాజిక సేవ తదితర రంగాల్లో బాలసుబ్రమణ్యం చేస్తున్న కషికి గాను ఈ నెల 16వ తేది తిరుపతి లో దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రాంగణం నందు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్టు పూలే టీచర్స్ ఫెడరేషన్ వారు తెలియజేశారు.

**IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM IV ADDITIONAL DISTRICT JUDGE (SC&ST COURT) AT SRIKAKULAM.**
**I.A NO 127/2023 IN M.V.O.P NO.244 /2017**

Between: **Guntu Akhila** -Petitioner.
And: **Hydar Sabi and two others** -Respondents

**NOTICE**

**2nd Respondent:** Dawood Saheb s/o not known, owner of the Crime Vehicle Lorry Bearing No. AP-03-X-1807 r/o Pathikonda Post, Mamadugu village, Gangavaram Mandal,Chittoor District.

Please take notice that the above number Petition filed by the Petitioner against the 2nd Respondent and other Respondents for claiming compensation of Rs. 6,00,000/- (six lakhs rupees only) for the grievous injuries sustained to minor child Guntu Akhila in a motor accident and this matter stands posted to **15-5-2023 at 10-30 A.M** For your appearance before the above said court, the 2nd respondent is hereby directed to appear before the above said court personally or through your advocate without fail, otherwise the matter will be decided in your absence.

**(By order of the court)**

**M.d. M.Phalguna Raju**
**Advocate for Petitioner.**
**Srikakulam**

# 2024 ఈవీఎంల భద్రతకు గోడౌన్ల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, రేణిగుంట:

రానున్న 2024 సంవత్సరంలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవిఎంలు, వివిప్యాట్‌లను అద్దె ప్రాతిపదికన గోడౌన్లలో భద్రపరిచేందుకు జేసీ డికె బాలాజీతో కలిసి రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి గోడౌన్లను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన కొత్తగా మ్యానిఫ్యాక్చర్ చేసిన బెల్ ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను జిల్లాలోనే భద్రపరచనున్నారు. గోడౌన్ మేనేజర్, సర్వేయర్‌తో మాట్లాడుతూ ఈవిఎంలు, వివిపాట్‌లు భద్రపరచుటకు దాదాపు 16 వేల చదరపు అడుగులు అవసరం అవుతుందని, భద్రత ప్రమాణాలు పాటించేలా ఏర్పాట్లు ఉండాలని, వాకిళ్లు, అగ్నిమాపక సాధనాలు, కరెంట్, సిసిటివిల ఏర్పాటు తదితర భద్రత, ఇతర ఏర్పాట్లు ఎన్నికల అధికారి నిబంధనల ప్రమాణాల మేరకు ఉంటాయని తెలిపారు. తదనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్, మేనేజర్ కేంద్ర గిడ్డంగులు రమేష్‌కుమార్ ఉన్నారు.

**'స్పందన' వినతులను అర్థవంతంగా పరిష్కరించాలి**

'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ తో కలసి జిల్లా కలెక్టర్ స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు డి ఆర్ ఓ శ్రీనివాసరావు, ఎస్ డి సి లు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి స్పందన ఆన్ లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 127 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించే 96 ఉన్నాయి.

రేణిగుంటలో ఈవిఎంలను భద్రపరిచేందుకు గోడౌన్లు పరిశీలిస్తున్న కలెక్టర్